ప్రజాశక్తి
శనివారం 7 జూన్ 2025 5
శ్రీ సత్యసాయి

గుంతలు 40.. వాటిని పూడ్చడానికి నిధులు రూ. 20 లక్షలు

అధికార పార్టీ నేతల కనుసన్నల్లో అధికార యంత్రాంగం ఏ విధంగా పనిచేస్తుందో చూడాలంటే హిందూపురం రూరల్ మండలం గోళాపురం పారిశ్రామిక వాడను సందర్శించాల్సిందే. ఇక్కడ సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు సంబంధించిన హెరిటేజ్ పరిశ్రమ ఉంది. ఈ పరిశ్రమకు వెళ్లే దారిలో గుంతలు ఉన్నాయని, పరిశ్రమ సందర్శనకు ముఖ్యమంత్రి బంధువర్గం వస్తే తమపై మండిపడతారని తెలిసి ఏపీఐఐసీ అధికారులు హుటాహుటిన రోడ్డుపై ఉన్న 40 గుంతలను పూడ్చడానికి చర్యలు తీసుకున్నారు. ఈ 40 గుంతలకు రూ. 20 లక్షలు ఖర్చు చేశారు. అయితే పక్షం రోజులకే చిన్న వర్షానికి పూడ్చిన గుంతల వద్ద కంకర తేలి అధికారుల అవినీతి బట్టబయలు అయింది.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని హిందూపురం రూరల్ మండలంలో ఉన్న పారిశ్రామిక వాడలకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. పారిశ్రామిక వాడ ప్రారంభంలో సడ్లపల్లి, తూమకుంట, కొట్నూరు పారిశ్రామిక వాడలను ప్రారంభించారు. పరిశ్రమలు విరివిగా రావడంతో మరింత అభివృద్ధి చేయాలని గోళాపురం పారిశ్రామికవాడను ప్రారంభించారు. ఈ గోళాపురం పారిశ్రామికవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు సంబంధించిన హెరిటేజ్ పరిశ్రమ ఉంది. గత నెల 15వ తేదీన ముఖ్యమంత్రి భార్య భువనేశ్వరి పరిశ్రమ సందర్శన కోసం వస్తున్నట్లు ఏపీఐఐసీ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో వారు పారిశ్రామిక వాడను సందర్శించారు. గోళాపురం సర్కిల్ నుంచి హెరిటేజ్ పరిశ్రమకు వెళ్లే అంతర్గత రహదారిలో గుంతలు ఎక్కువ ఉన్నాయని గుర్తించారు. అమ్మగారు సందర్శనకు వచ్చేలోపు ఆ గుంతలను పూడ్చాలని అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. ఏకంగా రూ. 20 లక్షల ఖర్చుతో అన్ని గుంతలను పూడ్చినట్లు సమాచారం. గుంతలు పూడ్చడానికి రూ. 20 లక్షలు ఖర్చా అని అనుమానం వచ్చి ఎన్ని గుంతలు పూడ్చారా అని క్షేత్రస్థాయి పరిశీలన చేస్తే అధికారుల అవినీతి మరింత బయటకు వచ్చింది. మొత్తం 40 గుంతలు ఉంటే అందులో రెండు చోట్ల మాత్రమే పెద్ద గుంతలు ఉన్నాయి. మిగిలిన అన్ని గుంతలు చిన్న చిన్న గుంతలే. సుమారు రూ. 5 లక్షలు సైతం ఖర్చు కానీ పనులకు ఏపీఐఐసీ అధికారులు ఏకంగా రూ. 20 లక్షలు ఎందుకు ఖర్చు చేశారో అర్థం కావడం లేదు. అధికారుల తీరుపై పారిశ్రామిక వాడలోని పారిశ్రామికవేత్తలతో పాటు కార్మిక సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామిక వాడలో అన్ని రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంత పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేసి వేసిన గుంతలు 15 రోజుల్లోనే చిన్నపాటి వర్షానికి కంకర తేలాయి. దీన్ని బట్టి చూస్తే అధికారులు ఎంత మాత్రం నాణ్యత పాటించారో అర్థమవుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఎపిఐఐసి అధికారుల తీరుపై వారు తీవ్రంగా మండిపడుతున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సమగ్ర విచారణ జరిపి అవినీతికి పాల్పడిన అధికార యంత్రాంగంపై చర్యలు తీసుకోవాలని పారిశ్రామికవేత్తలు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

'పురం' పారిశ్రామిక వాడలో గుంతల స్కాం

పారిశ్రామిక వాడలోని రోడ్డులోని గుంతలు పూడ్చి ప్యాచ్ వర్క్ చేసిన దృశ్యం

ఆదాయం ఉన్నా అభివృద్ధి శూన్యం ...

హిందూపురం రూరల్ మండలంలో ఏర్పాటుచేసిన పారిశ్రామిక వాడల్లో ఆదాయం బాగానే ఉంది. అయితే అభివృద్ధి చూడాలంటే కనుచూపుమేరా ఎక్కడ కనిపించడం లేదు. గతంలో పారిశ్రామిక వాడలకు సంబంధించిన పన్నుల వసూళ్లలో ఆయా పంచాయతీలకు అధికారం ఉండేది. అయితే ప్రభుత్వం నిబంధనలను మార్చి పారిశ్రామిక వాడల అభివృద్ధి కోసం ఐలా సంస్థను తీసుకురావడం జరిగింది. పన్నులను వసూలు చేయడంతో పాటు పరిశ్రమ స్థాపనల కోసం అనుమతులు ఇవ్వడం తదితర అధికారాలు ఐలా సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. ఈ సంస్థ అధికారులు పన్నులను వసూలు చేస్తున్నారే తప్ప పారిశ్రామిక వాడలో అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పరిశ్రమల పన్నుల వసూళ్ల అధికారం పంచాయతీలకు ఉన్నప్పుడు ఆ వచ్చే ఆదాయంతో ఆయా ప్రాంతాల అభివృద్ధి కోసం వినియోగించేవారు. అయితే పంచాయతీలు పారిశ్రామిక అవార్డులను పట్టించుకోకపోవడంతో ఎక్కడ చూసినా రోడ్లన్నీ గుంతల మయంగా మారిపోయాయి. ఇన్ని గుంతలు ఉన్నప్పటికీ కూడా కేవలం ముఖ్యమంత్రికి సంబంధించిన పరిశ్రమకు వెళ్లే పారిశ్రామిక వాడలోని అంతర్గత రహదారి మాత్రమే అధికారులకు కనిపించింది. వెంటనే గుంతలను పూడ్చారు. ఆ పని కూడా సక్రమంగా చేశారా అంటే అది కూడా నిర్లక్ష్యంగా చేయడంతో వేసిన పక్షం రోజులకే కంకర తేలింది. దీంతో ఏపీఐఐసీ, అధికారుల నిర్లక్ష్యంతో పారిశ్రామిక వాడల అభివృద్ధి ఆమడ దూరంలోనే నిలిచింది.

డీఎస్పీ పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

డీఎస్సీ పరీక్ష కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పట్టణంలో ఏర్పాటు చేసిన డీఎస్సీ పరీక్ష కేంద్రాల వద్ద శుక్రవారం పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 9 గంటలకు డీఎస్సీ పరీక్ష ప్రారంభమైంది. డీఎస్పీ పర్యవేక్షణలో పరీక్ష కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు చేపట్టారు. డీఎస్పీ మాట్లాడుతూ డిఎఫ్ఎండి ద్వారా అభ్యర్థుల హాల్‌టికెట్లను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, ఇతర వస్తువులను పరీక్ష కేంద్రంలోకి తీసుకెళ్లకుండా చర్యలు తీసుకున్నామన్నారు. సీసీ కెమెరాలతో పాటు డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ చేపట్టామన్నారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష కేంద్రం సమీపంలో 144 సెక్షన్ ఆంక్షలతో పాటు 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నామన్నారు. ఎలాంటి వాహనాలను అటువైపు అనుమతించకుండా చర్యలు తీసుకున్నామన్నారు. డీఎస్సీ పరీక్షలు ఈ నెల 30 వరకూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ తిరిగి మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకూ రెండు సెషన్స్‌గా నిర్వహిస్తారన్నారు.

వ్యవసాయ శాఖాధికారులతో చర్చిస్తున్న మంత్రి సవిత

10 నుంచి ఖరీఫ్ విత్తన వేరుశనగ పంపిణీ

ప్రజాశక్తి-పెనుకొండ

ఈనెల 10 నుంచి సత్యసాయి జిల్లాలో ఖరీఫ్ విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభించనున్నామని ఈ సందర్భంగా రైతులకు ఇబ్బందులు కలగకుండా విత్తన వేరుశనగ పంపిణీ చేపట్టాలని వ్యవసాయ అధికారులకు రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని మంత్రి స్వగృహంలో వ్యవసాయ అధికారులతో ఖరీఫ్ విత్తన వేరుశనగ పంపిణీ ఏర్పాటుపై చర్చించారు. ఈ సమావేశం లో మంత్రి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఎక్కువ విస్తీర్ణం లో వేరుశనగ పండిస్తారన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వేరుశనగ కందుల పంపిణీలో ఇటువంటి ఇబ్బంది లేకుండా రైతులకు అందించాలని చెప్పారు. గ్రామాలలో రైతులకు అవసరమైన వ్యవసాయ ఎరువులు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ ఏడాది రుతుపవనాలు ముందస్తుగా రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్నాయని వర్షాలు కూడా ఆశాజనకంగా కురుస్తున్నాయని అందుకు తగ్గట్టుగా పంటలు సాగు చేసేందుకు రైతులను అప్రమత్తం చేయాలని అన్నారు. సత్యసాయి జిల్లాకు సంబంధించి మండలాలవారీగా రైతు భరోసా కేంద్రాలకు ఎంత వేరుశనగ వచ్చింది, ఇంకా రావాల్సింది ఎంత అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, పెనుకొండ ఎడిఎ కృష్ణమీనన్, వ్యవసాయ అధికారి చందన తదితరులు పాల్గొన్నారు.

90 శాతం రాయితీతో విత్తన వేరుశనగ ఇవ్వాలి

ప్రజాశక్తి-నల్లచెరువు

రైతులకు 90 శాతం రాయితీతో విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, ఉపాధ్యక్షులు శివన్న డిమాండ్ చేశారు. నల్లచెరువులో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గతేడాది రైతులు జిల్లా వ్యాప్తంగా 2,45,000 హెక్టార్లలో పంట సాగు చేయగా అతివృష్టి, అనావృష్టి పరిస్థితులతో పంట చేతికందక తీవ్రంగా నష్టపోయా రన్నారు. అరకొరగా పండిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడ్డారన్నారు. విధి లేని పరిస్థితుల్లో జీవనోపాధి కోసం కొందరు ఇతర రాష్ట్రాలకు వలస పోగా, కొందరు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ప్రస్తుతం చిన్న, సన్నకారు, పేద రైతులు విత్తన వేరుశనగ కొనుగోలు చేయలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. కావున ప్రభుత్వం 90శాతం రాయితతో ఎకరాకు 3 ప్యాకెట్ల ప్రకారం ఐదెకరాలకు 15 ప్యాకెట్లు ఇవ్వాలని కోరారు. ప్రత్యామ్నాయ విత్తనాలైన కందులు, ఆముదాలు, ఉలవలు, ఇతర విత్తనాలను 90శాతం రాయితీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా పెట్టుబడి సాయం ఒకేసారి రూ. 20వేలు, ఎరువులను రాయితీతో ఇవ్వాలని, రూ. 2 లక్షల చొప్పున రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వారితో పాటు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శ్రీరాములు, మండల కార్యదర్శి వెంకటస్వామి ఉన్నారు.

ఆక్రమణదారులకు నోటీసులు

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఆర్అండ్‌బి స్థలాలను ఆక్రమించుకున్న వారికి తక్షణమే నోటీసులు జారీ చేయాలని ఆర్‌డిఒ సువర్ణ వీఆర్వో నజీర్, మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. ఆర్‌డిఒ శుక్రవారం ఉదయం స్థానిక పుట్టపర్తి రోడ్డులో నాగుల కనుమ వద్ద రోడ్లకు ఇరువైపులా ఆక్రమణలను పరిశీలించారు. అలాగే రోడ్లపై ఉన్న విగ్రహాలను తొలగించాల్సి వస్తే నాగుల కనుమ వద్ద ఉన్న నల్లకొండలో ఏర్పాటు చేసేలా అక్కడ స్థలాన్ని పరిశీలించారు. విగ్రహాలు ఏర్పాటు చేయడానికి ఈ స్థలం అనుకూలంగా ఉందా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం రెవెన్యూ, పంచాయితీ సిబ్బంది ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. ఆర్‌డిఒ వెంట వీఆర్వోలు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

పార్టీ బలోపేతాలని ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని వైసిపి నాయకులు గుడంపల్లి వేణురెడ్డి సూచించారు. శుక్రవారం లేపాక్షి మండలం కంచి సముద్రం పంచాయతీకి చెందిన వైసిపి నాయకులు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వేణురెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేణురెడ్డి ఆయా నాయకులతో ప్రత్యేకంగా సమావేశమై పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి ఆందోళన కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. అనంతరం పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సయ్యద్ నిసార్, మండల ఉపాధ్యక్షులు అంజన్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు బషీర్, మాజీ ఎంపీటీసీ మల్లన్న, బింగిపల్లి భాస్కర్ రెడ్డి తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నేత వేణు రెడ్డి

కెసి.శిరీషా

జిఎస్. చిర్రై

జాతీయ ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-హిందూపురం

జాతీయ ఉపకార వేతనానికి పరిగి మండలం మోద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. 2024 లో జాతీయస్థాయిలో జరిగిన నేషనల్ మీన్స్ కం మెరిట్ ఎగ్జామ్ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి చదువుతున్న శిరీషా, చిర్రై ప్రతిభ కనబర్చి జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఉమాదేవి శనివారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.12వేల చొప్పున వరుసగా 5 సంవత్సరాల పాటు కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనం ఇస్తుందన్నారు. ఇంత గొప్ప విజయాన్ని సాధించడానికి సహకరించిన పాఠశాల ఉపాధ్యాయులు రాజశేఖర్, గురు రాజారావు, రామారెడ్డి, మదనమోహన్ రెడ్డి, నారాయణస్వామిలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులను ఆమె అభినందించారు.

గుడ్డం దోబీఘాట్‌కు పైప్‌లైన్ ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో గుడ్డం దోబీఘాట్‌కు నీటి పైప్‌లైనును ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు, పూలకుంట సర్పంచి మంజునాథ్ పైప్‌లైన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, చాలా సంవత్సరాల నుండి గుడ్డం దోబీఘాట్, కాలనీ ప్రజలు నీటి సమస్యతో బాధపడుతున్నారన్నారు. వారి కోసం ప్రత్యేక నీటి పైపు లైన్ వేయించామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమణ, రాజేష్, ఫక్రుద్దీన్, బాషా, దోబీఘాట్ అధ్యక్షులు నారాయణప్ప, రామాంజి, వెంకటేష్, నారాయణప్ప, శంకర, నరసింహులు, రామాంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిని కలిసిన రాష్ట్ర మంత్రులు

ప్రజాశక్తి - గోరంట్ల

గోరంట్ల మండలం పాలసముద్రం వద్దనున్న నాసిన్ కేంద్రంలో శుక్రవారం నిర్వహించే పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను రాష్ట్రమంత్రులు మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మర్యాదపూర్వకంగా కలిసి నంది విగ్రహాన్ని, పుష్పగుచ్ఛంను అందజేసి ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర సంక్షేమం, చేనేత, మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత, హిందూపురం పార్లమెంట్ సభ్యులు పార్థసారథి తదితరులు కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

కేంద్ర మంత్రితో మాట్లాడుతున్న రాష్ట్రమంత్రులు,ఎంపీ

ప్రజావసరాల కోసం ప్రత్యేక సిబ్బంది

ప్రజాశక్తి-హిందూపురం

బక్రీద్ పండుగను పురస్కరించుకొని పురపాలక సంఘ వ్యాప్తంగా ప్రజా అవసరాలను పరిష్కరించడానికి టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశామనిపట్టణ ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, వైస్ చైర్మన్ జిబివుల్లా, కమిషనర్ సంఘం శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం కమిషనర్ ఛాంబర్ లో జామియా మసీదు ముత్వల్లి నూరుల్లా ఖాన్, కమిటీ ప్రతినిధులు, ముస్లిం మైనారిటీ పెద్దలతో బక్రీద్ పండుగపై ఏర్పాట్లు తదితర విషయాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జామియా కమిటీ ప్రతినిధులతో పట్టణంలో జరుగుతున్న పండుగకు సంబంధించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా ముస్లిం మైనారిటీ ఆచారం మేరకు కుర్బానీ కార్యక్రమాన్ని మూడు రోజులపాటు పట్టణంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. వీటి ద్వారా వచ్చే వ్యర్థాలను తరలించడానికి జామియా మసీదు తరపున ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేయాలని వారు సూచించారు. దీంతో జామియా కమిటీ తరపున ఐదు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి, వివిధ ప్రాంతాలలో ఆ వాహనాలు తిరిగి వ్యర్థాలను సేకరించి పురపాలక సంఘ అధికారులు సూచించిన ప్రాంతానికి అందిస్తామన్నారు. పురపాలక సంఘం తరపున ఏర్పాటు చేసిన ఐదు ట్రాక్టర్ల ద్వారా ఆ వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలిస్తామన్నారు. పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, నీటి సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 2633 ఏర్పాటు చేశామన్నారు. ప్రజలందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంహెచ్‌ఒ శోభన్ రెడ్డి, ఎసిపి చంద్రమ్మ, శానిటరీ ఇన్స్‌పెక్టర్లతో పాటు డాక్టర్ భాషా, మున్సిపల్ అధికారులు, జామియా మసీదు కమిటీ నిర్వాహకులు, మైనారిటీ పెద్దలు పాల్గొన్నారు.

కమిటీ నిర్వాహకులతో మాట్లాడుతున్న నాయకులు

ప్రత్యేక ప్రార్థనలకు ఈద్గా మైదానాలు సిద్ధం : బక్రీద్ పండుగను పురస్కరించుకొని శనివారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలను చేయడానికి పట్టణంలో ఈద్గా మైదానాలను సిద్ధం చేశారు.

చిత్రావతి నదిలో స్నానపు ఘాట్ల నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఈ ఏడాది నవంబర్‌లో శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో పట్టణ సమీపంలోని చిత్రావతి నది వద్ద స్నానపు ఘాట్ల నిర్మాణాలకు శుక్రవారం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వపరంగా చేయాల్సిన ఏర్పాట్లన్నీ ఆయా శాఖల ద్వారా చేపట్టనున్నామన్నారు. అందులో భాగంగా చిత్రావతి నది వద్ద రూ. 29 లక్షల వ్యయంతో 5 స్నానపు ఘాట్లు, ధోబీ ఘాట్ నిర్మాణ పనులు చేపట్టనున్నామన్నారు. వేడుకలకు సుమారు పది లక్షల మంది భక్తులు, పర్యాటకులు వస్తారని, అందుకు తగ్గట్టుగా రవాణా, తాగునీరు, మరుగుదొడ్లు, స్నానాల గదులు, రహదారుల నిర్మాణాలు, నిరంతర విద్యుత్ సరఫరా, తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నవంబర్ లోపే అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. శతజయంతి ఉత్సవాలకు ప్రత్యేక నిధులు విడుదల చేయాలని ఇప్పటికే సిఎం చంద్రబాబును కోరామన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, ఇరిగేషన్ అధికారి జమునాబాయి, సుధాకర్‌బాబు, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, తదితరులు ఉన్నారు.

త్వరలోనే సంక్షేమ పథకాల అమలు : ఎమ్మెల్యే

కొత్తచెరువు : ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పథకాలను త్వరలోనే అమలు చేస్తుందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. కొత్తచెరువులో వివాహాలకు హాజరైన ఎమ్మెల్యే పాత్రికేయులతో మాట్లాడారు. ఎన్నో ఒడిదు డుకులు, లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ సిఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నార న్నారు. ప్రతి హామీని తూచా తప్పకుండా అమలు చేస్తామన్నారు. విషం చిమ్మే వైసిపి నాయకుల మాయమాటలు ఎవరూ నమ్మవద్దని సూచించారు. ఎమ్మెల్యే వెంట టిడిపి మండల కన్వీనర్లు శ్రీనివాసులు, మల్‌రెడ్డి, నాయకులు గంగాద్రి, సామకోట ఆదినారాయణ, సోము, చంద్ర ఉన్నారు.

బ్రహ్మంగారి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

బుక్కపట్నం : మండలంలోని విశ్వబ్రాహ్మణుల విజ్ఞప్తి మేరకు మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి స్థానిక చెరువు కట్టపై బ్రహ్మంగారి ఆలయానికి స్థలం కేటాయించారు. దీంతో శుక్రవారం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి భూమిపూజ చేసి ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కారణజన్ముడు బ్రహ్మంగారు అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మల్‌రెడ్డి, నాయకులు సామకోటి ఆదినారాయణ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, జంగం వెంకటరాముడు, సాకే యశోద, తెలుగు మహిళా అధ్యక్షురాలు లావణ్యగౌడ్, బాలు, ఎర్రకేసి, సంజీవరాయుడు, సయ్యద్‌బాషా, సతీష్, అక్కులప్ప, విశ్వబ్రాహ్మణులు పాల్గొన్నారు.

స్నానాల ఘాట్ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

కుంభాభిషేకంలో పాల్గొన్న మంత్రి, ఎంపీ

ప్రజాశక్తి-సోమందేపల్లి : మండలంలోని చాలకూరు గ్రామంలో వెలసిన శ్రీఉమామహేశ్వరి ఆలయంలో శుక్ర, శని, ఆదివారాల్లో కుంబాభిషేకం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజైన శుక్రవారం మంత్రి సవిత, ఎంపీ బికె.పార్థసారథి వేర్వేరుగా ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదాలు స్వీకరించారు. వారి వెంట టిడిపి మండల కన్వీనర్ వెంకటేష్, నాయకులు నీరుగంటి చంద్ర, డివి ఆంజనేయులు, వడ్డే సురేష్, సిద్దలింగప్ప, కీర్తిస్వామి, రామకృష్ణ, సంజీవరెడ్డి, రామాంజనేయులు, జనసేన నాగరాజు ఉన్నారు.


శ్రీఉమామహేశ్వరి ఆలయంలో ఎంపీ పార్థసారథి

వ్యాధులపై అవగాహన

పుట్టపర్తి రూరల్ : మండలంలోని జగరాజుపల్లి గ్రామంలో శుక్రవారం పుట్టపర్తి పిహెచ్‌సి సిహెచ్‌ఒ నగేష్ ఆధ్వ ర్యంలో మలేరియా, అతిసార వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలంటే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, రోజూ యోగా చేయాలన్నారు. డ్రైడే ఫ్రైడే పాటించి జ్వరాల బారిన పడకుండా ఉండాలన్నారు. అలాగే మలేరియా, అతిసార లక్షణాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్య చికిత్స, మందులు, దోమల నివారణ, తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ గఫూర్, ఎస్‌యుఒ రమణయ్య, ఆరోగ్య కార్యకర్త ప్రమీల, ఆశా కార్యకర్త జ్యోతి పాల్గొన్నారు.

10న యోగాంధ్ర

లేపాక్షి : లేపాక్షిలో ఈ నెల 10వ తేదీ నిర్వహించే మండల స్థాయి యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీడీ నరసప్ప పిలుపునిచ్చారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పీడీ మాట్లాడుతూ యోగా కార్యక్రమంలో యోగాపై ప్రతి గ్రామంలో ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీఓ నరసింహమూర్తి, నవోదయ ప్రిన్సిపల్ నాగరాజు, ఎంఇఒ నాగరాజునాయక్, మండల స్థాయి అధికారులు, టీడీపీ మండల కన్వీనర్ అభి, బీజేపీ మండలం కార్యదర్శి నరసింహమూర్తి పాల్గొన్నారు.

9న సోమందేపల్లిలో..

సోమందేపల్లి : సోమందేపల్లిలో ఈ నెల 9వ తేదీ నిర్వహించే యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపిడిఒ వెంకటలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహిస్తామని, అందులో మండల స్థాయి అధికారులు, కార్యాలయాల ఉద్యోగులు, సిబ్బంది, సచివాలయం, ఉపాధి హామీ సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. అలాగే ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

టీసీలివ్వని విద్యాసంస్థలపై ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు

మడకశి : టీసీలు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్న ప్రయివేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంఇఒ భాస్కర్‌కు వినతి పత్రం సమర్పిం చారు. ఎస్ఎఫ్ఐ మండల నాయకులు కళ్యాణ్, సందీప్ మాట్లాడుతూ మండలంలోని కొన్ని ప్రయివేటు విద్యాసంస్థల్లో విద్యార్థులకు టీసీలు ఇవ్వడానికి అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. అలాంటి విద్యాసంస్థలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

నంబులపూలకుంట : మండలంలోని గౌకనపల్లి సమీపంలోని కల్లూరుపల్లి క్రాస్ వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచి రామాంజులురెడ్డి తెలిపారు. ఆ శిబిరంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పరీక్షలు చేస్తారని తెలిపారు. వచ్చే వారు ఆధార్, రేషన్ కార్డు వెంట తీసుకురావాలన్నారు. శస్త్రచికిత్స అవసరమైన వారికి కడప నగరంలోని పుష్పగిరి కంటి ఆసుపత్రిలో ఉచితంగా చేస్తారని, భోజన వసతి, వాహన సౌకర్యం కల్పిస్తారని తెలిపారు.

ఫిజియోథెరపీతో ఆరోగ్య సమస్యలు దూరం

బత్తలపల్లి : ఫిజియోథెరపీతో ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ రమేష్ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం డాక్టర్ రమేష్, సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఫిజియోథెరఫీ మెడికల్ క్యాంపు నిర్వహించారు. నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ రోజూ ఫిజియోథెరపీ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, ఆహారపు అలవాట్లు, తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహనాయుడు, కార్యాలయ ఏవో జి.శ్రీనివాసులు, డిప్యూటీ డిఇఒ పి.క్రిష్ణప్ప, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన

కదిరి టౌన్ : పట్నం పిహెచ్‌సి పరిధిలోని కాళసముద్రం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్‌లో శుక్రవారం క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టిబి సూపర్వైజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం పూట జ్వరం ఉన్నవారు సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో తప్పనిసరిగా గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారికి గళ్ల పరీక్ష చేయించాలన్నారు. రోగం నిర్ధారణ అయితే మందులు ఉచితంగా ఇస్తారన్నారు. అయితే రోగులకు పౌష్టికాహారం కోసం ప్రతినెలా వారి బ్యాంకు ఖాతాలో రూ. వెయ్యి జమ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వినోద్‌కుమార్, పిహెచ్ఎం లక్ష్మీదేవమ్మ, ఆరోగ్య కార్యకర్త రాజేశ్వరి, సూపర్వైజర్ విజయశేఖర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనం పరీక్ష ఫలితాలు విడుదల

కొత్తచెరువు : గత డిసెంబర్ 28వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ ఉపకార వేతనం పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయని జిల్లా వృత్తి విద్యాధికారి లాజర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారని విద్యార్థులు చూసుకోవాలన్నారు. ఎంపికైన విద్యా ర్థులు మెరిట్ కార్డు డౌన్‌లోడ్ చేసుకొని పేరు, పుట్టిన తేదీ, తండ్రి లేదా తల్లి, తదితర వివరాలను సరి చూసుకుని విద్యా మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ వారి స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అలాగే సంబంధిత పాఠశాల నోడల్ ఆఫీసర్, జిల్లా నోడల్ ఆఫీసర్ లాగిన్ ద్వారా అప్రూవల్ చేయించుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే సంబంధిత హెచ్ఎం ద్వారా డిఇఒకు అందజేయాలన్నారు.

రెసిడెన్సియల్ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పావగడ : కర్నాటక రెసిడెన్సియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాలూకాలో నిర్వహిస్తున్న 8 రెసిడెన్షియల్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 7, 8, 9 తరగతులకు మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 12వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు మల్లికార్జునయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆపని ఆర్టీసీ బస్సు.. ప్రయాణికుల మండిపాటు

ప్రజాశక్తి-రొద్దం

అసలే ఆర్టీసీ ఆదాయం అంతంత మాత్రం.. దీనికి తోడు కొందరు డ్రైవర్లు, కండక్టర్లు బాధ్యతారా హిత్యంగా విధులు నిర్వహిస్తుండడంతో ఆ ఆదాయానికి గండి పడుతోందని చెప్పవచ్చు. రొద్దంలో శుక్రవారం ఉదయం ముగ్గురు ప్రయాణికులు బస్సు కోసం వేచి ఉన్నారు. ఆ సమయంలో పెనుకొండ వైపు నుంచి పావగడ వెళ్తున్న ఆర్టీసీ బస్సు వచ్చి ఆర్.మరవపల్లి బస్టాప్‌లో బయల్దేరింది. కాస్త ముందుకు రాగానే ముగ్గురు ప్రయాణికులు పావగడకు వెళ్లేందుకు వేచి ఉన్నా డ్రైవర్ బస్సును ఆపకుండా వెళ్లిపోయారు. ఆ బస్సులో చాలా సీట్లు ఖాళీగా ఉన్నా ఆపకుండా పోవడం ఏంటని ప్రయాణికులు మండిపడ్డారు. ఇదిలా ఉండా ఈ మార్గంలో ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి రవాణా చేస్తున్నా అడిగే వారే కరువయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ఇకనైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ప్రయాణికులకు సమస్య లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ప్రయాణికులున్నా ఆపకుండా వెళ్తున్న ఆర్టీసీ బస్సు..

'అన్నా.. వ్యాపారం బాగుందా..'

హోటల్ నిర్వాహకుడితో మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం గోరంట్ల మండలంలోని పాలసముద్రం వద్ద ఉన్న నాసిన్ కంపెనీకి వచ్చారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రికి స్వాగతం పలకడానికి మంత్రి సవిత ఇక్కడికి వచ్చారు. అయితే కేంద్ర మంత్రి రావడానికి ఇంకా సమయం ఉండడంతో మంత్రి సవిత ఆ లోపు అక్కడే రోడ్డు పక్కన ఉన్న చిన్న హోటల్‌కు అల్పాహారం తిన్నారు. అలాగే 'అన్నా.. వ్యాపారం బాగుందా.. ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా' అంటూ హోటల్ నిర్వాహకుడిని ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

హోటల్ వద్ద ఉన్న కూలీలతో ముచ్చటిస్తున్న మంత్రి సవిత

టిడిపి నాయకుని మృతికి మంత్రి నివాళి

రొద్దం : మండలంలోని పెద్దగువ్వలపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు తిమ్మయ్య(58) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే మంత్రి సవిత ఆ గ్రామం వెళ్లి తిమ్మయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఎంపీ బికె పార్థసారథి అల్లుడు శశిభూషణ్ తిమ్మయ్య మృతదేహానికి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట టిడిపి నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, వెంకటరామిరెడ్డి, చంద్రమౌళి, వీరాంజి, మనోహర్, తదితరులు ఉన్నారు.

నూతన వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-బత్తలపల్లి

పంటల సాగులో రైతులు నూతన వ్యవసాయ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించా లని శాస్త్రవేత్తలు సూచించారు. బత్తలపల్లి, సంజీవపురం గ్రామాల్లో శుక్రవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. రెడ్డిపల్లి కెవికె, రేకులకుంట లైవ్ స్టాక్ రీసర్చ్ స్టేషన్ శాస్త్రవేత్తలు డాక్టర్ శశికళ, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ శ్రీనివాస్‌నాయక్, రఘుకరణ్ రైతులకు వ్యవసా యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలు, నూతన సాంకేతికత, వ్యవసాయ పద్ధతులు, వంగడాలు, డ్రోన్ స్ప్రేయింగ్, తదితర అంశాలను వివరించారు. అనంతరం భూసార పరీక్ష పత్రాలను పంపిణీ చేశారు. వారి వెంట మండల వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి, ఎఇఒలు శ్రీనివాస్, ఉపేంద్రరెడ్డి, రైతు సేవా కేంద్రాలు, సిబ్బంది, రైతులు ఉన్నారు.

అమడగూరు : వ్యవసాయ రంగంలో అధిక మోతాదులో ఉపయోగించే ఎరువులు, పురుగు మందులకు స్వస్థి చెప్పి, పంటల సాగులో వైవిధ్యాన్ని ప్రోత్సహించాలని రెడ్డిపల్లి కెవికె, ఐఐఒఆర్ శాస్త్రవేత్తలు డాక్టర్ మాధవి, డాక్టర్ దూరయ్ మురుగన్ రైతులకు సూచించారు. మండలంలోని మహమ్మాదాబాద్ గ్రామ సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని రైతులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం భూసార పరీక్ష పత్రాలు పంపిణీ చేశారు. రైతుల అభిప్రాయాలు తెలుసుకుని వారు వ్యవసాయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి నివారణ చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఏవో వెంకటరమణాచారి, రమణ, అపర్ణ, పవన్, అరవింద్, రైతు సేవ కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ పద్ధతుల గురించి తెలియజేస్తున్న శాస్త్రవేత్తలు

బుక్కపట్నం : వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం వాడి అధిక లాభాలు పొందాలని కెవికె, రేకులకుంట విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు నారాయణస్వామి, డాక్టర్ కిషోర్‌రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని యాదాలంకపల్లి, గసిగవారి పల్లి గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ వికసిత్ కృషి సంకల్ప అభియాన్ ముఖ్య ఉద్దేశాన్ని రైతులకు వివరించారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకొని అందుకనుగుణంగా పంటలు సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో సతీష్ బాబు, పశు వైద్యాధికారి ఉదయ్, ఆర్ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలంలో మొక్కలు నాటిన అధికారులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు పట్టణంలోని మున్సిపల్ స్థలాల ఆక్రమణలు, కబ్జాలను అడ్డుకోవడంతో పాటు వాటిని పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో మున్సిపాలిటీ చర్యలు తీసుకుంటోందని కమిషనర్ ప్రమోద్‌కుమార్, మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్ బాబు తెలిపారు. వారు మాట్లాడుతూ స్థానిక రేగాటిపల్లి రోడ్డు సమీపం లోని రెవెన్యూ కాలనీ వద్ద ఉన్న 91 సెంట్ల మున్సిపల్ స్థలం కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకో వాలని ఆ ప్రాంత ప్రజలు, నాయకులు మంత్రి కార్యాలయంలో విజ్ఞప్తి చేశారన్నారు. దీంతో శుక్రవారం ఆ స్థలాన్ని పరిశీలించి ఫెన్సింగ్ వేయించడంతో పాటు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించా మన్నారు. వారి వెంట నాయకులు వడ్డే నారప్ప, స్థానికులు, మహిళలు పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలంలో మొక్క నాటి నీరు పోస్తున్న అధికారులు

మల్లాకాలువలో వాల్మీకి విగ్రహ ఏర్పాట్లు

ధర్మవరం రూరల్ మండలంలోని మల్లాకాలువ గ్రామంలో శుక్రవారం మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు వాల్మీకి విగ్రహ ఏర్పాటు భూమి పూజలో పాల్గొన్నారు. అనంతరం సచివాల యాన్ని సందర్శించి అక్కడి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పనివేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. విత్తన వేరుశనగ పంపిణీపై ఆరా తీశారు. రైతులకు సకాలంలో విత్తన కాయలందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఆయన వెంట నాయకులు చంద్ర, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

'అంగన్వాడీ పిలుస్తోంది' ర్యాలీ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు "అంగన్వాడీ పిలుస్తోంది" కార్యక్రమాన్ని సిడిపిఒ శాంతి ఆదేశాల మేరకు నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం మున్సిపల్ పరిధిలోని పాత హస్నాబాద్, న్యూ హస్నాబాద్, కరుణాపురం అంగన్వాడి కేంద్రాల్లో అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ అనిత మాట్లాడుతూ, జూన్ 1 నుండి 15 వరకు అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో మహిళలు, గర్భిణులు, ఐదేళ్ల లోపు చిన్నారులకు అందుతున్న పథకాలపై వివరించడం జరుగుతుందని ఆమె తెలిపారు. అదే విధంగా అంగన్వాడి కేంద్రంలో ఆటపాటలతో కూడిన ఆంగ్ల విద్యను బోధిస్తామని, అంగన్వాడి కేంద్రంలో అందించే విద్య ప్రాథమిక పాఠశాలకు పునాదిగా ఉంటుందని అన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలని సూచించారు. ప్రైవేట్ స్కూలు వద్దు, అంగన్వాడీ ముద్దు అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మీనరసమ్మ, రాజేశ్వరి, షాహిదా, సుజాత, సహాయకులు అఫ్రీన్, శాలినీ సల్మా, షాహిన్ అంగన్వాడీ చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

హిందూపురంలో అంగన్వాడీ పిలుస్తోంది ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది


సమావేశానికి హాజరైన ఏజెన్సీ నిర్వాహకులు

మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి

ప్రజాశక్తి-లేపాక్షి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతగా, రుచిగా అందించాలని ఎంఇఒలు నాగరాజు, కుళ్లాయప్ప సూచించారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న కుక్ కమ్ హెల్పర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎంఇఒలు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో కుక్ కమ్ హెల్పర్ల పాత్ర అత్యంత కీలకమన్నారు. మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని అత్యంత శ్రద్ధగా, శుభ్రంగా నిర్వహించాల్సిన బాధ్యత వారిపై ఉందని గుర్తు చేశారు. వంటకాలకు వాడే పదార్థాలు నాణ్యతతో కూడినవై ఉండాలన్నారు. వంటగది పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, వేడి భోజనం సరఫరా వంటి అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

బక్రీద్ ప్రార్థనలకు విస్తృత ఏర్పాట్లు

ధర్మవరం రూరల్ : బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎంపిడిఒ సాయి మనోహర్ ఓ ప్రకటనలో కోరారు. ప్రార్థనలు చేసుకోవడానికి మండలం లోని పలు గ్రామాల్లో ఉన్న ఈద్గాలతో పాటు మసీదుల వద్ద శుభ్రం చేయించడంతో పాటు విస్తృత ఏర్పాట్లు చేయించామన్నారు. ముస్లింలకు ఎంపిడిఒ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలోజరుపుకోండి : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ వి.రత్న సూచిం చారు. మత సామరస్యానికి ప్రతిగా నిలిచే బక్రీద్ పండుగను శాంతి, సామరస్యాలు వెల్లివిరిసేలా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. బక్రీద్ పర్వదినాన జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మసీదులు, మదరసాలు, ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. గోవధ చేయరాదన్నారు.

పెనుకొండ అభివృద్ధికి సహకరించాలని కేంద్రమంత్రికి వినతి

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి సహకారం అందించాలని కోరుతూ శుక్రవా రం నాయకులు జిఎం శేఖర్ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ 500 ఏళ్ల క్రితం శ్రీకృష్ణదేవరాయలు కర్నాటకలోని హంపిని మొదటి రాజధానిగా, పెనుకొండను రెండో రాజధానిగా చేసుకుని పాలన సాగించారని కేంద్ర మంత్రికి వివరించారు. రాయలు పెనుకొండలో పట్టణంలో 365 దేవస్థానాలు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంద న్నారు. కొండపైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం, కోనేరు, కాలినడకన కొండపైకి వెళ్లే భక్తులకు మండపాలు నిర్మించారన్నారు. కావున ఆనాటి ఆలయాలు, పట్టణం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎనుముల రామకృష్ణ, రవి, రామాంజనేయులు, తదితరులు ఉన్నారు.

జాతీయ ఉపకార వేతనానికి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని పులమితి జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు పూజారి భవ్యశ్రీ, అంకిత నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు హెచ్ఎం సుబ్బారావు తెలిపారు. విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన సోషియల్ ఉపాధ్యాయులు అశ్వర్థనారాయణను హెచ్ఎంతో పాటు సర్పంచి అశ్వర్థనారాయణ, ఎస్ఎంసి ఛైర్మన్ నరసింహమూర్తి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ధర్మపురిలో మధులికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ధర్మవరం రూరల్ : మండలంలోని ధర్మపురి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థి యు.మధులిక జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు హెచ్ఎం జి.సౌభాగ్యమ్మ తెలిపారు. మధులికను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు పి.కుళ్లాయప్ప, బి.నాగరాజు, గ్రామస్తులు అభినందించారు.

అమడగూరు : మండలంలోని గాజులపల్లి ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వి.బిందుశ్రీ జాతీయ ఉపకార వేతనానికి అర్హత సాధించినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. బిందుశ్రీకి ఏటా రూ. 15 వేల చొప్పున నాలుగేళ్ల పాటు (మొత్తం రూ. 60వేలు) అందుతుందని తెలిపారు. బిందుశ్రీని ప్రిన్సిపల్‌తో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

అమడగూరులో బిందుశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు

బాలుడికి విద్యుత్ షాక్

సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని డీఎస్పీ కార్యాలయ సమీపంలో శుక్రవారం ఓ బాలుడు విద్యుత్ షాక్‌కు గురై అపస్మారస్థితిలో పడిపోగా పోలీసు కానిస్టేబుల్ సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడాడు వివరాలు.. స్థానిక డీఎస్పీ కార్యాలయం సమీపంలో ఉన్న ఓ ఇంటి పైనున్న 11 కెవి విద్యుత్ లైన్ తీగలు బాలుడు నరేష్‌కి తగలడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. ఆ సమయంలో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న పోలీసు కానిస్టేబుల్ దేవేంద్ర వెంటనే అప్రమత్తమై ఆ బాలుడికి సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. అలాగే బాలుడిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. ప్రాథమిక చికిత్స అనంతరం బాలుడిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో సిపిఆర్ చేసి బాలుడి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ దేవేంద్రను పలువురు అభినందించారు.

బాలుడికి సిపిఆర్ చేస్తున్న కానిస్టేబుల్

వైసిపి నేత గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని చల్లాపల్లి గ్రామానికి చెందిన సీనియర్ వైసిపి నేత బాబురెడ్డి శుక్రవారం బెంగళూరులోని ఓ ప్రయివేట్ ఆసుత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందారు. స్థానిక వైసిపి నాయకులు తెలిపిన వివరాలు.. బాబురెడ్డి వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పని చేశారన్నారు. పార్టీ అధినేత జగన్‌తో సన్నిహితంగా ఉండేవారని, పార్టీలో కూడా క్రియాశీలకంగా వ్యవహరించే వారన్నారు. గతంలో పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్తగా కూడా పని చేశార న్నారు. ప్రస్తుతం ఆయన బెంగళూరులో నివాసం ఉంటూ పెనుకొండ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించే వారని, ఆయన ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటు అన్నారు. విషయం తెలిసిన వెంటనే పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ బాబురెడ్డి మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

బాబురెడ్డి(ఫైల్‌ఫొటో)

రాత్రికి రాత్రే కొత్తిమీర కోసుకెళ్లిన దుండగులు

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని తుమ్మలకుంట గ్రామానికి చెందిన కురుబ హరిత తనకున్న ఒక ఎకరా భూమిలో కొత్తిమీర పంటను సాగు చేసింది. అయితే గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పంటను కోసి ఎత్తుకెళ్లారు. దీంతో సుమారు రూ. 60 వేలు నష్టపోయినట్లు బాధితురాలు హరిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితులపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

ఆలయంలో చోరీ

రొద్దం : రొద్దంలో రోజురోజుకూ దొంగల బెడద తీవ్రమవుతోంది. పది రోజుల క్రితం కంచి సముద్రం గ్రామంలో చోరీ జరిగింది. అది మరువకనే భూధిపల్లి గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు.విషయం తెలుసుకొన్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని బాపూజి నగర్ లో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ తెలిపారు. వార్డు పర్యటనలో భాగంగా శనివారం ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్యతో కలిసి బాపూజి నగర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సతీష్ కుమార్, రాఘవేంద్ర, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ప్రెస్ వెంకటేష్, టీడీపీ నాయకులు సుమో సీనా, నూరుల్లా, ప్రవీణ్, రాజు, రవి, మహేష్, చిరంజీవి, వెంకటేష్, రియాజ్, నాని, ఎమ్.ఈ. దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-హిందూపురం

పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు కేశవులు, రామచంద్ర రావు, సుప్రవీణ్ అన్నారు. శనివారం స్థానిక ఐఎంఎ హాల్ లో ఐఎంఎ, ఐసిడిఎస్ శాఖ సంయుక్తంగా ఆహార దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ ఛైర్మన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మారుతున్న సమాజంలో మన ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లలో చాలా మార్పులు వస్తున్నాయన్నారు. రంగు రంగుల పాకెట్లకు ఆకర్షితులై వాటికి అలవాటు పడి అనారోగ్యానికి గురి అవుతున్నారు. అనంతరం ఐసిడిఎస్ వారు ఏర్పాటు చేసిన ఆహార పధర్థాల స్టాల్స్‌లను వారు పరిశీలన చేశారు. అదే విధంగా చిన్న పిల్లలకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సీడీపీవో శాంతి, వైద్యులు వెంకటేశ్వర్లు, నరసింహ రావు, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

9న షైనింగ్ స్టార్లకు అవార్డులు

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్థానిక ధర్మవరం రోడ్డులో ఉన్న వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఈ నెల 9వ తేదీ షైనింగ్ స్టార్ కార్యక్రమం నిర్వహిస్తామని డిఇఒ జి.కృష్ణప్ప శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. షైనింగ్ స్టార్ కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థుల వివరాలను ఇప్పటికే ఎంఇఒలు, హైస్కూళ్ల హెచ్ఎంలకు పంపామ న్నారు. ఆ జాబితాలో ఉన్న ప్రతి విద్యార్థి, వారి తల్లిదండ్రులకు సమాచారం పంపి, కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు తప్పక హాజరు కావా లని, ప్రతి విద్యార్థి ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం మొదటి పేజీ జిరాక్స్ తీసుకు రావాలన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ఎంపిక

గోరంట్ల : పట్టణంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు పి.వివేకానందరెడ్డి-596, పి.చరితారెడ్డి-595 మార్కులు సాధించి షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ మోహన్‌రెడ్డి తెలిపారు. వీరికి ఈ నెల 9వ తేదీ కొత్తచెరువులో విద్యాశాఖ అధికారులు అవార్డును ప్రదానం చేస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల ఎజిఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

చరితారెడ్డి-595


పి.వివేకానందరెడ్డి-596

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, HINDUPUR
S.O.P.No: 1/2025

Between:
M.Nagaraju,
M.Sarojamma ...Petitioners
And
Nil ...Respondants

పై నెంబరు పిటీషన్ యందు పిటీషనర్స్ Succession Certificate కొరకు పిటీషన్ దాఖలు చేసివున్నారు. ఇందులో ఎవరికైనా ఆక్షేపణలు వున యెడల 20-06-2025వ తేది ఉదయం 10:30 గం॥లకు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
K.MALLIKARJUNA, Advocate,
Hindupur. Cell:9441091706.